# అగ్ని పరీక్ష

శ్రీ కృష్ణునికి 'అగ్నిభుక్' అని పేరుంది. పారిజాతాపహరణ సమయాన ఇంద్రుడు ఆయనపై ఆగ్నేయాస్త్రం ప్రయోగిస్తే. ఆ అగ్నిని కృష్ణుడు మింగేశాడట. అలాగే ఆయనకు 'అగ్నిహారకః' అని పేరుంది. ముంజారణ్యంలో రగుల్కొనిన అగ్నిని ఆయన హరించేడట! సర్వ దైవశక్తులు అనంతమైన లీలలు చూపించిన కృష్ణపరమాత్మ ఈ రోజుల్లో ఉండడం చాలా అవసరం అనిపిస్తుంది.

అమలాపురంలో అగ్నికీలలు ఆగటంలేదు. దాదాపు 45 రోజులు పైగా గ్యాసుమంటలు ఓ.ఎన్.జి.సి. వారు ఆర్పలేకపోయారు. అమెరికా నుంచి వచ్చిన నిపుణుల బృందాలుకూడా ఇంతవరకు తమ ప్రయత్నాలు సఫలీకృతం కాలేదని వాపోతున్నాయి. ఏంచేయాలో తోచని దిక్కులేని స్థితిలో వున్నారు. ఆధునిక శాస్త్రజ్ఞానం అంతా వృధా అవుతోంది. ప్రస్తుత విజ్ఞాన శాస్త్రవేత్త బుద్ధి ఎంత పరిమితమో మనకు అర్థం అవుతోంది.

అమలాపురం కోనసీమ ప్రాంతం. చాలా అందాలు సంతరించుకున్న స్థలం. ఒకసారి నేనోపద్యం వ్రాశాను కోనసీమ గురించి.

"ఆ దరి కోనసీమ, వరుసన్ కనిపించెను నారికేళ వృ
క్షాదులు, పల్లెదారులును, కాల్వలు, జంటలు జంటలై, ఏదో
విందొనరించె కన్నులకు, విచ్చినఆకుల గాలి వీచి మ
ర్యాదలు చేసె రంభలు, విరాజిలు రమ్య వసంత సీమయే

అని. అటువంటి కోనసీమ అగ్నికీలలకు తాళలేక మలమల మాడి పోతోంది. అక్కడి కాల్వల నీరు చాలటం లేదు.

ఆ అగ్నిని ఆర్పడానికి సైనికుల బాంబుల అగ్నికూడా ఈ అగ్నిని అర్పలేక పోతున్నది. ఆ అగ్ని కీలల వెలుగుల్లో కొబ్బరితోపులు దూరంగా వున్నవి చీకట్లలో మిలమిల మెరిసిపోతూ కనిపిస్తున్నాయి. ఈ సమస్య కేంద్ర ప్రభుత్వానికి అగ్ని పరీక్ష అయితే ఎన్నికలు, కుంభ కోణాలు పెరిగిపోయిన ఈ దేశంలో, ఈ అగ్ని పరీక్షకు ప్రచారం సరిగా వాడిగా వేడిగా లేదు. మరో దేశమైతే ఇదొక పెద్ద రాజకీయ సమస్య అయ్యేది.

ఈ రోజుల్లో అగ్నిని సృష్టించే యోగులు వున్నారా ? పూర్వకాలం కన్నులు తెరిస్తే అగ్నిగోళాలు వెలిగి రాలేవట ! శివుడు మూడో కన్ను తెరిస్తే అంతా భస్మం చేసే అగ్నికీలలు సృష్టించగలడుట! ఒకసారి బాల శివయోగి యజ్ఞంచేస్తూ, పది సంవత్సరాలక్రితం అగ్నిని తన కళ్ళచూపు లతో దూదిపై సృష్టించి హోమం చేశారు. ఆ అగ్నిని తరువాత ఆర్పడా నికి వర్షం కురిపించారు. అమలాపురంలో కృత్రిమ వర్షాలు అనంతంగా కురిపిస్తే ఈ అగ్నికీలలు ఆపగలమా ! ఈ ఆలోచన ఎవరికీ వస్తున్నట్లు లేదు -సినీమాలో ప్రేమ అగ్నికీలల మధ్య వర్షాలు కురిపిస్తూ, నాయికా నాయికల అంగాంగ సౌందర్యాల అగ్నికీలలు ప్రేక్షకులకు వ్యాపింప చేయడం మనం చూస్తూనే వున్నాం - ఇక్కడ అగ్ని గ్యాసు లీక్‌వల్లే కాకుండా, చమురు వ్యాప్తివల్లకూడా మంటలు రేగుతున్నాయి.

ఆది మానవుడు అగ్నిని సృష్టించాడు కర్ర కర్ర రాపిడి చేసి. మహానుభావుడు రాముడుకూడా పతివ్రత సీతను అగ్ని ప్రవేశం చేయించి, ఆమెకు అగ్నిపరీక్ష పెట్టాడు.

అగ్నిహోత్రుడు ప్రత్యక్షమై సీత పవిత్రమైన సతీమణి అని, ఆమెను రామునికి అప్పగించారు . ఈ రోజుల్లో ఇటువంటి సమయాల్లో

అగ్నిహోత్రుని దర్శనం చేయించుకుని అగ్నిని ఉపసంహరించగల బాబాలు ఎందరో వున్నారు.

ఇటీవల విశాఖపట్నంలో బాలశివయోగి రామాయణం గురించి మాట్లాడుతూ, యోగులకు అనంతశక్తులు వుంటాయని, వారి కళ్ళు అవసరమైతే అగ్నిగోళాలని అంటే, ఓ ప్రేక్షకుడు గేలిచేశాడట ! ఆయన ఆ ప్రేక్షకుడికి ఓ పాఠం చెప్పాలని, తనకు సన్మానం చేసిన కొత్త శాలువా పట్టుకుని తన నేత్రాలద్వారా అగ్నిని సృష్టించి ఆ శాలువ కాల్చేసి చూపించారుట !

మన భారతదేశం పుణ్యభూమి. చాలామంది మహాయోగులు నిర్జన అరణ్య ప్రదేశాలలో, కఠోర శీతల హిమాలయాలలో వున్నారని, వారికి దైవశక్తులు కరతలామలకమని చెబుతారు.

వేద ప్రచారాలు చేసుకుంటున్న స్వాములు, యోగులు, బాబాలు ముందుకు వచ్చి ఈ అమలాపురం అగ్నికీలలు ఆర్పి పుణ్యం కట్టుకోలేరా ? ఇది ప్రజాసేవ కాదా ? కేంద్రప్రభుత్వం ప్రస్తుత యోగుల్ని కొందర్ని ఈ విషయంలో కదిపి వారి శక్తులకు అగ్నిపరీక్ష పెట్టవచ్చు కదా ! ఊరికే పాదాలకు దణ్ణాలుపెట్టి సంతృప్తి పొందేకంటే, ఇటువంటి ప్రజా సమస్య కోరికలు తీర్చమని అడగడం రాజకీయ నాయకులకు చాలాముఖ్యం - పూర్వకాలం రాజులు తమ దేశంలో ఏ సమస్య వచ్చినా, తమమునులకు నివేదించి,వారి ఆశీర్వాదాలతో ప్రజలకు క్షేమంకలిగించేవారు

అయితే మునులకు ధనం ప్రధానం కాదు - కానీ ఈ కాలపు యోగులకు ధనమే ప్రధానం.

సరే రోజూ మనం ఇళ్ళల్లో చూస్తున్నాం అగ్నికీలలు - వంటలకు, కోడళ్ళ హత్యలకు - కిరోసిన్ అగ్ని కలిసి కాపురం చేయడం మన దేశంలో మామూలే ! ఈ రోజుల్లో అగ్నికీలలు హరించే 'కృష్ణులు' ఎవరూ లేరా ? ఇది మన పుణ్యభూమికి అగ్నిపరీక్ష.

(1995 జనవరి, ఫిబ్రవరిలో అమలాపురం ప్రాంతంలో ఓ ఎన్ జి సి ఆయిల్ బావిలో అగ్నికీలల గురించి)